# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 21 జనవరి, 2026 | పేజీలు : 06


## గోపాల్‌నగర్ పంచాయతీ భవనానికి స్థలం కేటాయించాలి

తహసీల్దార్‌కు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఐచ్చన్నపేట :** మండల పరిధిలోని గోపాల్ నగర్ గ్రామ పంచాయతీకి నూతన భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు తగిన ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. ఈమేరకు మంగళవారం మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హస్సేన్‌ను గోపాల్‌నగర్ సర్పంచ్ పేరబోయిన కళ్యాణి పరుశరాములు, ఉప సర్పంచ్ చింతల కర్ణాకర్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పంచాయితి భవనం సరిపోవడం లేదని అనువైన ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. అందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు




మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** రాబోయే వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా వ్యాప్తంగా పంప్‌సెట్లు, పనిచేస్తున్న బోర్ వెల్‌ల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. మైనర్ రిపేర్ల కోసం చెక్‌లిస్ట్ తయారు చేసి గుర్తించిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాలలో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ బోర్లు, ఇతర నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించి వేసవిలో తాగు నీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా జాయింట్ ఇన్స్పెక్షన్లు నిర్వహించి సమస్యలు ఉత్పన్నం కాకముందే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**లెస్ ప్లాస్టిక్, లెస్ పేపర్, లెస్ పవర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి**

ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని, కార్యాలయాల ఫైల్స్ అన్నీ ఈ ఆఫీసులో ఉండాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం తగ్గించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగ రావు, మెదక్ ఆర్‌డిఓ రమాదేవి, జిల్లా అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మండలపరిషత్ అధికారులు, హౌసింగ్ ఎఇలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రధాన లక్ష్యం

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

మహిళా సంఘాలకు రూ.74.26 లక్షల వడ్డీలేని రుణాల పంపిణీ

6,584 మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం జోగిపేట పట్టణంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందోల్, జోగిపేట మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని ఋణాల చెక్కులు, అలాగే ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా గ్రామీణ, పట్టణ స్థాయిలో ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు కుటుంబాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని మహిళా సంఘాలకు మొత్తం రూ.74.26 లక్షల వడ్డీలేని ఋణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ ఋణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాల్లో ముందడుగు వేయాలని సూచించారు. అలాగే మహిళల సంక్షేమని దృష్టి ఉంచుకుని ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న ఇందిరమ్మ పథకం కింద మొత్తం 6,584 మంది మహిళ సభ్యులకు ఇందిరమ్మ చీరలను మంత్రి పంపిణీ చేసారు. పేద మహిళలకు గౌరవం, భరోసా, కల్పించడమే ఇందిరమ్మ, పథకం లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువస్తున్నాయని భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అందోల్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాట్లు అయితే స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అన్నారు. పార్టీలకతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలే ఉద్దేశ్యంతో అందోల్‌లో ఐదు ఎకరాల భూమిని ప్లాటుగా విభజించి పంపిణీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. అలాగే మహిళలకు నాణ్యతతో కూడిన చీరల పంపిణీ సన్న బియ్యం, సరఫరా, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్, అంజయ్య, అడిషనల్ కలెక్టర్ పాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ మోహ్మా పిడి రామాచారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు అధికారులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## 'విబి-జి రామ్ జి' చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తాం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/మెదక్ :** విబిజి రామ్ జి చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మండిపడ్డారు. పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యుపిఎ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని విమర్శించారు. స్కీమ్‌ను మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని విమర్శించారు. విబిజి రామ్ జి చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం చట్టం తేవడం దుర్మార్గమన్నారు. ఈ చట్టం తేవడం మూలంగా పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీజీరామ్ జీ) గా మార్చే బిల్లును ఎమ్మెల్యే రోహిత్ రావు తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడంలాంటి గొప్ప లక్ష్యాలతో నాటి యుపిఎ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. ఉపాధి హామీ పని దినాలను 200కి పెంచాలనీ, రోజుకూలిని రూ.307 నుంచి రూ.600 వరకు పెంచడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్, జిల్లా సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు ఆవుల గోపాల్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సుప్రభాత్ రావ్, మేడి మధుసూదన్ రావ్, రాగి అశోక్, సరాఫ్ యాదగిరి, శ్రీనివాస్ చౌదరి, ముత్యం గౌడ్, హరిత, జ్యోతి, అశ్విని, శివ రామకృష్ణ, గాడి రమేష్, సునీల్,స్వరూప పాల్గొన్నారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ రీ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడిఓసి నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ భూ సర్వే చట్టం సెక్షన్ 5(1), 6(1) కింద గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసి, జిల్లాలో మొదట దశగా మొత్తం 13 గ్రామాలను రీ సర్వే చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ గ్రామాల్లో గ్రామనక్షలు (గ్రామ పటాలు) లేకపోవడం లేదా అస్పష్టంగా ఉండడం వల్ల రైతుల పొలాల హద్దులను ఖచ్చితంగా నిర్ణయించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనివల్ల గట్టు (సరిహద్దు) వివాదాలు తరచుగా ఉత్పన్నమవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రీ సర్వే ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో పొలాల గట్టు హద్దులు, రోడ్లు, చెరువులు, కాలువలు, గ్రామ కంఠం భూములు తదితరాలను ఖచ్చితంగా గుర్తించి, శాస్త్రీయ పద్ధతిలో హద్దు రాళ్ల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి రైతు భూమికి సంబంధించిన అక్షాంశాలు, రేఖాంశాలుతో కూడిన ఖచ్చితమైన భూ పటాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా భూ వివాదాలు పూర్తిగా నివారించ బడతాయని, భూ లావాదేవీలు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి

ప్రజాపక్షం/దేవరుప్పుల : విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఊర సృజన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఎఫ్ఐ నూతన క్యాలెండర్‌ను ఎస్ఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోకుండా బాగా చదువుకుని జీవితంలో గొప్ప స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమ, ఏఎస్ఐ సదానందం, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విజి-జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

ప్రజాపక్షం/తరిగొప్పుల : గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి పాత మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరిగౌడ్ కోరారు. డీసీసీ జిల్లా అధ్యక్షులు లకావత్ ధన్వంతి, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో ఆయన పర్యటించి సచివాలయాలలో అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వందల పని దినాలు కల్పిస్తూ గతం లో 90 శాతం నిధులు కేంద్ర బడ్జెట్లో, రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం ఉండేలా పాత విధానాన్నే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఉప సర్పంచ్ మహేష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు శివకుమార్, సమ్మయ్య, రాజు పాల్గొన్నారు.

## దుబ్బగుంటపల్లిలో విషాదం

ప్రజాపక్షం/బచ్చన్నపేట: మండలంలోని దుబ్బగుంటపల్లి గ్రామంలో వృద్ధ దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. గ్రామానికి చెందిన కందుల శంకరయ్య , ఉప్పలమ్మ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో విగత జీవులుగా కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల మృతిపై అనుమానాలు ఉన్నాయని కుమారుడు అశోక్ ఫిర్యాదు చేశాడు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె హమీద్ తెలిపారు. వారి మృతి లోటని సర్పంచ్ కొంతం చంద్రకళ స్వామి సంతాపం వ్యక్తం చేశారు.

## నీటిలో ఈదుకుంటూ వెళ్లి కరెంటు మరమ్మతు



ప్రజాపక్షం/జఫర్‌గఢ్ : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో 11 కేవీ అగ్రికల్చర్ ఫీడర్‌లో ఇన్సులేటర్ పగిలి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అసిస్టెంట్ లైన్మెన్ సామాల అశోక్ సాహసం చేశారు. చుట్టూ నీళ్లు ఉండడంతో ఎర్త్ రాడ్, ఇన్సులేటర్‌తో నీటిలోకి ఈదుకుంటూ వెళ్లి మరమ్మత్తులు చేపట్టి రైతులకు విద్యుత్‌ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాడు. ఈ విషయం తెలుసుకున్న స్టేషన్ ఘనపూర్ ఎన్పీడీసీఎల్ ఏఈ పి శంకర్‌తోపాటు సిబ్బంది, వినియోగదారులు అశోక్ ధైర్యాన్ని అభినందించారు.

# అందరికీ నాణ్యమైన విద్య అందించాలి

### కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



ప్రజాపక్షం/-జనగామ: అందరికి నాణ్యమై విద్య అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. పదవ తరగతి పరీక్షలకు పక్కాగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, మెను ప్రకారం భోజనం పెట్టాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ సమీక్షలో భాగంగా విజయోస్తు 2.0 నిర్వయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎస్సి యాక్షన్ ప్లాన్, స్పెషల్ క్లాసులు, దిక్సూచి ఆచరణ, ఎఫ్ఎల్ఎస్ మాక్ టెస్ట్, ఎంఈఓలు, హెచ్ఎంలుతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్సి ఫలితాల్లో జనగామ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానం లో ఉండాలన్నారు. పిఎం పోషణ కార్యక్రమంలో భాగంగా గామన కార్యక్రమం డేటా అప్లోడ్ చేసి ప్రథమ స్థానంలో ఉంచాలని, విద్యార్థులు ఏఏ విషయాల్లో వెనకబడి ఉన్నారో వాటి మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ ప్రైవేట్ లో చదువుతున్న అర్హతగత అందరికి ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా చూడాలని ఆదేశించారు. వారం వారం బృంద సమావేశాలు ఏర్పాటు చేసుకొని విద్యార్థుల పాఠశాల జిల్లా స్థితిఇ మెరుగు పరచాలన్నారు. రానున్న 40 రోజులు కీలకమని ఒక్క ఎస్ఎస్సి విద్యార్థి కూడా పాఠశాలకు గైర్హాజర్ కాకూడదన్నారు. 40 రోజులని పరీక్షల టైంగా టై ్ర ప్రకారం నిర్వయించాలన్నారు. దిక్సూచి ప్రత్యేక కార్యక్రమంలో జనగామ జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమమని ఇది కేవలం పాఠశాలకు పరిమితం అయ్యే కార్యక్రమం కాదన్నారు. విద్యార్థుల మూర్తిమాత్వాన్ని వికసించే విధంగా సమాజంలో ప్రభావవంతమైన వ్యక్తులుగా ఎదిగేదిగా చేసదన్నారు. పాఠశాలలకు కొత్తగా ఎంపికైన సర్పంచ్‌లను ఆహ్వానించాలని, విద్యార్థులు, పాఠశాల అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలన్నారు. విద్యాశాఖ అధికారి, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ స్థాయి పెంచాలన్నారు. సిడి స్థాయిలో ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పిల్లలని ఉపాధ్యాయులకు కేటాయించిన మానిటరింగ్ చెయ్యాలని, సహ వద్యార్థుల సహాయంతో వెనకబడిన విద్యార్థుల పురోగతి అయ్యేలా చూడాలన్నారు. ఎస్ఎ 2 ఫలితాలు విశ్లేషణ చేస్తూ ఏ అంశాల్లో ఎంత మంది విద్యార్థులు వెనకబడి ఉన్నారో వారి పురోగతి ఏమిటన్నది అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రతి ఉపాధ్యాయులు అవకాశం లభించినప్పుడు వివిధ స్థాయిలలో తమ ప్రతిభ నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ తేజస్వీ, విద్యాశాఖ ఏడి సత్యనారాయణమూర్తి, ఏసిజి రవికుమార్, డిసిఈబి సెక్రటరీ చంద్రబాను, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రిన్సిపాల్స్, కెజిబివి ఇంఛార్జ్‌లు పాల్గొన్నారు.

# రైతుల బాంధవుడు ఎమ్మెల్సీ పోచంపల్లి

### ఎమ్మెల్సీ పోచంపల్లి చిత్రపటానికి పలాభిషేకం చేసిన రైతులు..



ప్రజాపక్షం/నడికూడ : హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోల్ గ్రామం నుండి వేములపల్లి బీటీ రోడ్డు పనులు పూర్తయిన సందర్భంగా స్థానిక సర్పంచ్ దొగ్గెల కుమారస్వామి ఆధ్వర్యంలో స్థానిక నల్లచెరువు బతుకమ్మ విగ్రహం వద్ద రైతులు సంబరాలు చేస్తూ,ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.గ్రామ సర్పంచ్ దొగ్గెల కుమారస్వామి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ రోడ్డు కోసం ఎదురుచూశాము.వర్షం పడితే పొలానికి వెళ్లడం కూడా కష్టంగా ఉండేది.ఇప్పుడు ట్రాక్టర్లు, ఆటోలు నేరుగా పొలం గట్టు దగ్గరకు రావడం జరుగుతుంది మా కష్టాలు తీరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.అదేవిధంగా శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వరికోల్ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి జన్మనిచ్చిన ఊరు కుటుంబంగా భావించి తన సొంత గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ గత సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వరికోల్ నుండి వేములపల్లి శివారు వరకు బిటి రోడ్డు పూర్తి చేయించారు.గ్రామంలో వ్యవసాయ రైతులు కూలీలు ఇబ్బంది పడకుండా తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు గ్రామం చుట్టూ ఉన్న రోడ్లను అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిదే అని ఐక్యమతమై గ్రామ అభివృద్ధి అనే నినాదంతో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు.ఈ రోడ్డు పూర్తవడం వల్ల వరికోల్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటం అనేది కేవలం ప్రయాణ సౌలభ్యం మాత్రమే కాదు అది రైతుల ఆర్థికాభివృద్ధికి ఒక ప్రధాన సోపానం,కొత్త రోడ్డు నిర్మాణం పట్ల స్థానిక రైతులు తమ వరికోల్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతూ గ్రామంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ గ్రామ అభివృద్ధికి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,అనేక విధాలుగా కృషి చేస్తున్నారని గతంలో గుంతల రోడ్ల వల్ల పంటను మార్కెట్‌కు తీసుకెళ్లడం పెద్ద సవాలుగా ఉండేది,ఇప్పుడు కొత్త రోడ్డు వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతోందని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు డైగా రాజు,బిఆర్ఎస్ పార్టీ యూత్,వివిధ కుల సంఘాల నాయకులు,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు అల్వాస్‌దాస్ వర్ధంతి



ప్రజాపక్షం/నర్సంపేట : వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు అల్వాస్ దాస్ వర్ధంతి వేడుకలు మంగళవారం ఉదయం నర్సంపేట మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. అల్వాస్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అల్వార్ దాస్ గారు 1986లో స్థాపించిన వాకర్స్ క్లబ్ ద్వారా ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా 2500 వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేసి వాకింగ్ తో ఆరోగ్యం మాత్రమే మెరుగుపరచుకోవడం కాకుండా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమాజంలో సేవ చేస్తూ ఎంతో మంది వాకర్స్ కు ఇలాంటి సేవ చేసే అవకాశాన్ని కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడేపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, అహ్మద్, రామస్వామి, సారంగపాణి, ప్రభాకర్, భిక్షపతి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## క్యాలెండర్ ఆవిష్కరించిన డిఐఇఒ



ప్రజాపక్షం/జనగామ టౌన్ : జిల్లా కేంద్రంలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను డీఐఈవో జితేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం, విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం లెక్చరర్లు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఉర్దూ అవార్డు గ్రహీత ఉర్దూ లెక్చరర్ ఇస్రాత్ భానును డీఐఈఓ సన్మానించారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్షులు డా. వస్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటాలు కొనసాగుతాయన్నారు. లెక్చరర్లకు రెండో ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గణేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, బాధ్యులు సబియా, శ్రీనివాస్, ముక్తదీర్, తిరుమలేష్, భాను, వరుదిని పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

ప్రజాపక్షం/జనగామ టౌన్: జనగామ పట్టణంలో అనునిత్యం ప్రజా సమస్యలపైన ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం పార్టీ అభ్యర్థులను ఎన్నికలలో గెలిపించాలని, సీపీఎం అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. మంగళవారం జనగామ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అబ్బాస్ మాట్లాడుతూ జనగామ జిల్లా ఏర్పడినప్పటి నుండి జిల్లా స్థాయి అభివృద్ధి పెద్దగా జరుగలేదని పట్టణం అభివృద్ధి అయితేనే జిల్లా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు.పట్టణ సమస్యల పైన ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్న సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అహల్య, శేఖర్, నాయకులు గోపి, విజేందర్, అజారుద్దీన్, దస్తగిరి, లింగం, వెంకట మల్లయ్య, శ్రవణ్, కళ్యాణి, లలిత, బాలమణి, ప్రశాంత్, బీరయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాలి బూడిదైన వరిగడ్డి కట్టలు



నడికూడ/ప్రజాపక్షం : నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామంలో బుస్స కొమురయ్య,కుమారస్వామిలకు చెందిన 300 గడ్డి కట్టలకు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ వరిగడ్డి కట్టలకు నిప్పంటించడంతో గడ్డి కట్టలు కాలి బూడిదైనాయి.ఈ సమాచారం100కు సర్పంచ్ కొంగంటి తిరుపతి ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారని సర్పంచ్ తెలిపారు. అలాగే ఫైర్ ఇంజన్ కి సమాచారం ఇచ్చి ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపుచేశారని అయినా కూడా వరిగడ్డి కట్టలు కాలి బూడిదైనవని, దీనికి కారణం అయిన వారిని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తిరుపతి తెలిపారు.వరిగడ్డి కట్టలు కాలడంతో ఆ రెండు కుటుంబాలు కన్నీరు మున్నీరవుతున్నారు.వరి గడ్డి కట్టల విలువ సుమారు 50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ రైతు కుటుంబాలు కోరుతున్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** చిన్నవయస్సులో బాల్య వివాహాలను జరిపిస్తే పెండ్లి చేసుకున్న అమ్మాయిలకు భవిష్యత్తులో ఆరోగ్యపరంగా ఎంతో నష్టపోవాల్సి వస్తుందని పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చింతల వెంకటరాం రెడ్డి అన్నారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారి హేమ భార్గవి ఆధ్వర్యంలో మండలంలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సు రాకున్నా తొందరపడి అమ్మాయిలు పెండ్లిలు చేసుకోవద్దని, చదువుతోనే మీకందరికి బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన వివరించారు. చిన్న వయసులో పెండ్లిళ్లు చేసుకోవడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల లేక పోవడంతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు వస్తాయని ఆయన తెలిపారు. గ్రామాలు, తండాలలో బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహం జరిగినట్లు తెలిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. పిల్లలందరు బడిలో ఉండాలని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని ఆయన సూచించారు. గ్రామంలోనే అతిత్వరలోనే తల్లిదండ్రులకు కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆయన ఐసీడీఎస్ సిబ్బందికి ఆయన సూచించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష, జెండర్ స్పెషలిస్టు కవిత,



హెచ్ఎం సునంద, ఉపాధ్యాయయులు, పంచాయతీ కార్యదర్శి రాధిక విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/కొల్చారం:** ఇంటర్ వార్షిక పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కొల్చారం మండల తహసిల్దార్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బూతు లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులతో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. సేలబస్ ను అడిగి తెలుసుకున్నారు. డ్రాప్ అవుట్ లు ఉండొద్దని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ఇంటర్ విద్యలో అత్యధిక ఫలితాలు సాధించాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని, సరైన సమయంలో సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం కావాలని తెలియజేశారు. తహసిల్దార్ శ్రీనివాస చారి, రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలఉపన్యాసకులు,విద్యార్థులు,పాల్గొన్నారు.

# గ్రామంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కొల్చారం :** ఈ రోజులలో ఆరోగ్యాన్ని మించిన సంపాదనలేదని ఆరోగ్యమే మహాభాగ్యం అని పైతర గ్రామ సర్పంచ్ కొల్చారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు యాబన్న గారి రవితేజ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పైతార గ్రామంలో సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ వారి సౌజన్యంతో గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మల్లారెడ్డి హాస్పిటల్ వైద్యులు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మేర ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘ కాలికంగా ఇబ్బందులు పడుతున్న రోగులకు మెరుగైన వైద్య పరీక్ష కొరకు మల్లారెడ్డి హాస్పిటల్ తీసుకెళ్లడం జరుగుతుందని వారి సౌకర్యం కొరకు హాస్పిటల్ నుండి బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని హాస్పటల్ సిబ్బంది వెల్లడించారు.

# ట్రాక్టర్ బ్యాటరీల దొంగల హల్‌చల్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని పిల్లుట్ల గ్రామంలో నిలిపి ఉన్న ట్రాక్టర్ ఇంజన్ నుంచి బ్యాటరీలను గుర్తుతెలియని దొంగలు దొంగతనంగా ఎత్తుకెళ్లారు. పిల్లి శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్టర్‌తో వ్యవసాయం చేసుకుంటూ నాట్లు వేసేందుకు దున్నకం చేస్తూ చీకటి పడగానే రోజు మాదిరిగానే పొలంలోనే ట్రాక్టర్‌ను అక్కడే ఉంచి ఇంటికి వచ్చేసి ఉదయం వెళ్లి మళ్లీ ట్రాక్టర్‌తో బురదకు ట్రాక్టర్‌తో దున్నకం చేపడుతున్నారు. సోమవారం ఉదయం ట్రాక్టర్ వద్దకు వెళ్లిన శివకుమార్ బ్యాటరీ చోరి అయిందనే విషయాన్ని గ్రహించి ఇరుగుపొరుగు పొలాల రైతులను ఫోన్‌చేసి బ్యాటరీ దొంగతనం గురించి వాకబు చేసినా ఫలితం లేకుండా పో యింది. శివకుమార్ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ దొంగతనం చేసిన గుర్తుతెలియని



దొంగలు గ్రామంలో నిలిపి ఉన్న గ్రామపంచాయతీ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ పట్టుకెళ్లేందుకు విఫలయత్నం చేశారని పంచాయతీ కార్యదర్శి నగేష్ తెలిపారు.

# మాజీ మంత్రి హరీష్‌పై అక్రమ కేసులకు తగిన బుద్ధి చెప్తాం

### గజ్వేల్ మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం

**ప్రజాపక్షం/గజ్వేల్:** సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందునే మాజీ మంత్రి హరీష్ రావుపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నట్లు గజ్వేల్ మాజీ మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు హరీష్ రావుకు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో సిట్ ఏర్పాటు చేయడం సిగ్గుచేటని నిలదీశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ కేసులను చూసి తెలంగాణ ఉద్యమ కారులు భయపడతారని అనుకుంటే అది వారి అజ్ఞానానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రతీకార చర్యలు తప్ప పేదల సంక్షేమం మర్చినట్లు విమర్శించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అవినీతి పేరుకుపోగా, సీఎం రేవంత్ రెడ్డి సమైక్యవాదుల చేతుల్లో కీలుబొమ్మగా మారినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ దివాళా



రాజకీయానికి అద్దం పడుతుండగా, ప్రజలే తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. బొగ్గు గనుల్లో కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు బహిర్గతం చేసిన రోజునే హరీష్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వగా, సీఎం రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడేది లేదని వివరించారు.

# మున్సిపల్ కమిషనర్‌పై చర్యలకు బీజేపీ డిమాండ్

**ప్రజాపక్షం/రామాయంపేట:** న్సిపాలిటిలో అవినీతికి పాల్పడిన కమీషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు దర్నా చేపట్టారు. ఈసందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగిరాములు, జిల్లా ఉపాద్యక్షులు శంకర్‌గౌడ్, పట్టణ అద్యక్షులు శీలం అవినాష్‌రెడ్డిలు మాట్లాడుతూ మున్సిపల్ కమీషనర్ దేవేందర్ అవినీతికి పాల్పడి కోట్ల రూపాయలు దోచుకున్నారని వెంటనే అతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే భారతీయ జనతా పార్టీ అద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచు బక్కయ్యగారి యాదగిరి, ఓబిసి మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతల శేఖర్, పట్టణ ప్రదాన కార్యదర్శులు మన్నె ప్రవీణ్‌రాజు, అక్కల అనిల్, పట్టణ ఉపాద్యక్షులు నాగరాజు, భరత్, వెంకట్, స్వామి, యువ మోర్చా నాయకులు పోచమ్మల కన్నయ్య, మహిళా మోర్చా నాయకురాలు లావణ్య, దయానంద్, బానుచందర్, ముత్తయ్య, నవాత్‌రాజు, కటికే కార్తిక్, బాసం అనిల్, గిరి, సందీప్, వెల్మల రమేష్, దామోదర్‌తో పాటు పాల్గొన్నారు.

# చల్లపల్లి గ్రామపంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/టేక్మాల్ :** టేక్మాల్ మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి కృషితో యన్‌ఆర్‌జియస్ పథకం కింద రూ.20 లక్షల నిధులు మంజూరై, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నూతనంగా ఏర్పడిన చల్లపల్లి గ్రామపంచాయతీకి భవనం మంజూరు చేసినందుకు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ భవనం మంజూరుకు కీలకంగా కృషి చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ గారిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటీ డీఈ ప్రభాకర్, పంచాయతీ రాజ్ ఏఈ వెంకట్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, గ్రామ సర్పంచ్ సంగీత గోపాల్, కార్యదర్శి మదన్ లాల్, ఆర్‌టీఏ సభ్యులు మల్లారెడ్డి, మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదయ్య, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాపయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భక్తుల కిషోర్, సాగర్, శంకర్, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, వార్డు సభ్యులు శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నగరం గ్రామంలో గ్రామసభ



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రామంలో నూతన పాలక వర్గం ఏర్పాటు అయిన తర్వాత మొదటి గ్రామసభ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ కి సంబంధించిన అంశాలను చర్చించుట జరిగింది అలాగే విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామంలో ఆడపిల్ల జన్మించినట్లయితే 2016 రూపాయలు ఫిక్స్ డిపాజిట్ మరియు ఒక చందనపు మొక్కను తన స్వంత నిధులతో అందిస్తామని గ్రామ సర్పంచ్ అంతంపల్లి సుశీల సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరీఫ్ హుస్సేన్, ఉపసర్పంచ్ నాజం, పాలక వర్గం సభ్యులు, గ్రామ స్థాయి అధికారులు, మాజీ సర్పంచ్ గేమ్సింగ్, మాజీ ఎంపీటీసీ రవి, ఉప్పలయ్య, గుగ్లోత్ దేవేందర్, పాత్లోత్ బాబు, అంతంపల్లి సురేష్ బాబు గ్రామస్థులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని పలు పారిశ్రామిక వాడల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజ్ కుమార్ తెలిపారు.నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్న నేపథ్యంలో కళ్ళకల్, ముప్పిరెడ్డి పల్లి, కొండాపూర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనుల కోసం చేపడుతున్న ఈ విద్యుత్ కోతకు వినియోగదారులు, పరిశ్రమ యాజమాన్యులు, గ్రామస్తులు అంతా సహకరించాలని ఆయన కోరారు.

# మనోహరాబాద్‌లో ప్రారంభమైన సిఎం కప్‌పోటీలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మండల కేంద్రమైన మనోహరాబాద్ లోని జెఎంజే పాఠశాలలో మంగళవారం సీఎం కప్ వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ అనుష భాస్కర్ యాదవ్, ఎంపీడీవో రవీందర్ తో కలిసి ఈ క్రీడలను ప్రారంభించారు. క్లస్టర్ పరిధిలోని 12 గ్రామాల నుంచి 6 జట్టు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పిడి మంజుల,వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వాలీబాల్ మ్యాచులు జోరుగా కొనసాగాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన పాలకవర్గ సభ్యులు, అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు అగర్వాల్‌సమాజ్ చేయూత

**ప్రజాపక్షం/శివ్వంపేట :** చదువులతో పాటు ఆటలలో కూడా విద్యార్థులంతా ముందుండాలని శేరిలింగంపల్లి ఆగర్వాల్ సమాజ్ ప్రతినిధి పద్మావతి అన్నారు. మండలంలోని పాంబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఆటవస్తువులను శేరిలింగంపల్లి ఆగర్వాల్ సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆగర్వాల్ సంస్థ ప్రతినిధి పద్మావతి మాట్లాడుతూ ఇక్కడి పాఠశాల పరిసరాలన్ని ఎంతో బాగున్నాయని, విద్యార్థుల క్రమశిక్షణ కూడా సైతం నచ్చిందని ఆమె అన్నారు. ప్రస్తుతం అందించిన సహకారం కాకుండా రాబోయే విద్యాసంవత్సరం కూడా పాంబండ విద్యార్థులకు ఆగర్వాల్ సమాజ్ సంస్థ ద్వారా స్పోర్ట్స్ మెటీరియల్, డ్రెస్ మెటీరియల్‌ను కూడా అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# పేదల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మహిళా సాదికారత పిల్లలకు నైపుణ్యాలతో కూడిన ప్రమాణవంతమైన విద్య పేదల ఆరోగ్యభద్రతకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రాదాన్యత అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని పి.ఎస్. ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని సంగారెడ్డి శాసన సభ నియోజకవర్గ పరిధిలోని కంది ,కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి, మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకం కింద చెక్కులను పంఫిణి చేశారు. ఈ సందర్భంగా మొత్తం రూ. 2.54 కోట్ల విలువైన చెక్కులను 254 మంది లబ్దిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సామాజిక ఆర్థిక ,విద్యా ,వైద్య భద్రత కల్పించడం ప్రభుత్వ భాధ్యతని అన్నారు. ఆ దిశగా పేదల ఆరోగ్యం భద్రత వైద్య రక్షణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందన్నారు. మహిళల ఉన్నతికి మహిళా సాదికారతకు పెద్ద పీట వేస్తూ పిల్లలకు నైపుణ్యాలు ,ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంలో బాగంగా వడ్డీలేని ఋణాలను అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా బాల భరోసా, కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. వయోవృద్దుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక బాద్యత తీసుకుని ప్రణాము కార్యక్రమం ద్వారా వృద్దుల డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేసిందని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్య భద్ర ప్రభుత్వానిదేనని ,ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్య చికిత్సలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకప్పుడు క్యాన్సర్ చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ప్రస్తుతం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలోనే క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కంటి సంబందిత కాట్రాక్ట్ శస్త్ర చికిత్సలు సహా అన్ని ఆధునిక వైద్య సేవలను సంగారెడ్డి ఆసుపత్రిలో అందుబాటులో తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. టీజీఐఐసి చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ అడగకుండానే ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని అందించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు అన్ని విదాల అండగా నిలుస్తోందన్నారు. ఇంటి స్థలం ఉన్నా లేకపోయినా ఎమ్మార్వో కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధికి పాటు పడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆర్డిఓ రాజేందర్ ,డాక్టర్ మౌనిక,తహసీల్దార్లు లబ్దిదారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# గజ్వేల్ మున్సిపల్‌లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ మున్సిపల్ లో బిజెపి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ లో ఎన్నికల శంఖారావాన్ని పూరించిన సందర్భంగా ప్రజ్ఞా గార్డెన్స్‌లో పట్టణ పార్టీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ అధ్యక్షతన, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ నేతృత్వంలో జరిగిన విజయ సంకల్ప సమావేశంలో మున్సిపల్ ఇంచార్జి ఆకుల విజయ, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ తో కలిసి ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్ ప్రజలు బిజెపికి అండగా నిలువగా, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ మెజారిటీ సాధించలేదని చెప్పారు. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ 13 ఏండ్ల కాలంలో 10 సార్లు కూడా గజ్వేల్‌కు రాలేదని ఎద్దేవా చేశారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ ఇప్పటికీ రింగ్ రోడ్డు పూర్తి కాలేదని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని చేతులెత్తేసినట్లు విమర్శించారు. అలాగే గజ్వేల్‌లో నిర్మించిన ఆసుపత్రిలో స్థానికులకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని, సమీకృత మార్కెట్ నిర్మాణంతో ప్రయోజనం లేకపోగా, రోడ్లపైనే దుకాణాలు ఉంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మల్లన్నసాగర్ బాధితులకు రూ 240 కోట్లు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధి బిజెపితోనే సాధ్యపడుతుందని, ఇందుకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి నందన్ గౌడ్, మాజీ జడ్పిటిసి సింగం సత్తయ్య, నేతలు నలగామ శ్రీనివాస్, ఉప్పల మధుసూదన్, ఎల్లు రాంరెడ్డి, సుభాష్ చంద్రబోస్, సురేష్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు రెండో రోజు విశేష స్పందన

### వినూత్న ఆవిష్కరణలతో విద్యార్థులను ఆకట్టుకున్న ప్రాజెక్టులు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** కొల్లూరు క్యాంపస్ లోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ లో జనవరి 19 నుండి 23 వరకు నిర్వహిస్తున్న సౌత్ ఇండియా సైన్స్ పెయిర్ 2026 రెండో రోజు కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి . రెండో రోజు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు సింపోజియం చర్చావేదికలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సైన్స్ పెయిర్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లు వినూత్న ఆలోచనలతో శాస్త్రీయ దృష్టికోణంతో రూపొందించబడ్డాయని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ కు చెందిన నికితా నాయక్ తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకతకు ఆవిష్కరణల ప్రతిభా కు ఈ పెయిర్ అద్భుత వేదికగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. రెండోరోజున తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వివిధ ప్రాఠశాలలకు చెందిన సుమారు 18 వేలకు పైగా విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై సైన్స్ పెయిర్ స్టాళ్లను సందర్శించారు. ప్రదర్శించిన ప్రయోగాలు నమూనాలు, ఆవిష్కరణల ద్వారా విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై అవగాహన పెంచుకున్నారు. కోడివ్యర్థాలను (చికెన్ వ్యస్ట్) ఉపయోగించి చేపలు ఆహారంగా మార్చే వ్యవసాయ విధానాన్ని ఆప్లై చేపల వ్యర్థాలను నైట్రిపికేషన్ ప్రక్రియ ద్వారా మొక్కలకు ఆహారంగా మార్చే విధానాన్ని సిఎమ్ ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ కు చెందిన దీక్షిత వివరించారు. ఈ ప్రాజెక్ట్ సస్టైనబుల్ అగ్రికల్చర్‌కు చక్కటి ఉదాహరణగా నిలిచింది. అలాగే అగ్రి రోబోట్ ఇంటిగ్రేటెడ్, సస్టైనబుల్ అగ్రికల్చర్ లూనార్ ప్రార్మింగ్ ఎక్స్‌ప్లోరర్ రోవర్ వంటి ప్రాజెక్టులకువిద్యార్థులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి,. జెడ్పిహెచ్ఎస్ (గర్ల్స్) పటాన్‌చెరుకు చెందిన హెచ్ అర్చనా మాట్లాడుతూ ఇంతటి అద్భుతమైన విద్యా పరమైన ప్రయోగాలను చూడడం ఎంతో ఉత్సాహన్నిచ్చిందని తన స్వంత ప్రయోగాన్ని ప్రదర్శించేందుకుఅవసరమైన జ్ఞానల ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా పొందానని తెలిపారు. రోజంతా సైన్స్ ఫెయిర్ ప్రాంగణంలో సందర్శకుల రద్దీ కొనసాగింది. జిజ్ఞాసను రెకెత్తించి తరగతి గది అభ్యాసాన్ని వాస్తవ ప్రపంచంతో అనుసందానం చేస్తాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతికత పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ భవిష్యత్తు శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



# ప్రకృతి ప్రేరణతో అద్భుత డిజైన్లు




**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** ప్రకృతి బౌతిక శాస్త్రం నుంచి ప్రేరణ పొందిన ఆప్టిమైజేషన్ సూత్రాలు తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన నిర్మాణ డిజైన్లకు దారితీస్తాయని ఐఐటి హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాత కుమార్ తెలిపారు. గీతం స్కూల్ ఆప్ టెక్నాలజీలో టోపాలజీ ఆప్టిమైజేషన్ సిద్దాంతం ,ఆచరణ అనే అంశంపై మంగళవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. ఏరోస్పెస్ ఆటోమెటివ్ రంగాల్లో వాస్తవ వినియోగాలను వివరించారు. తగ్గిన పదార్థ వాడకం ,తక్కువ ఖర్చు ,మెరుగైన సౌందర్యం అవసరమన్నారు. ఫ్రఖ్యాత ఇంజనీర్ రాబార్ట్ లే రెకోలైన్‌ను ఉదహరించి నిర్మాణ కళలో రంధ్రాలు ఎక్కడ పెట్టాలో తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రోపెసర్ రామశాస్త్రీ వడాల స్వాగతం ,సత్కారం, విభాగాదిపతి ,డాక్టర్ ఎండ అక్తర్ ఖాన్ పరిచయం డాక్టర్ నికుల్ జాని వందన సమర్పణతో ముగిసింది.

# బాలుర వసతి గృహం ఆనంద నిలయం విద్యార్థులకు బ్లాంకెట్ల పంపిణీ

### న్యూలాండ్ పౌండేషన్ కంపెనీ సెక్రటరీ శారద

**పజాఫక్షం/సంగారెడ్డి :** ప్రభుత్వ వసతి గృహం లో ఉండే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయకి చేరుకోవాలని న్యూల్యాండ్ పౌండేషన్ కంపెనీ సెక్రటరీ మేడం శారద ఆకాంక్షించారు. న్యూల్యాండ్ పౌండేషన్ ఆద్వర్యంలో మంగళవారం సంగారెడ్డిలోన ప్రభుత్వ బాలుర వసతి గృహం ఆనంద నిలయం విద్యార్థులకు బ్లాంకెట్లను పంఫిణి చేశారు. ఈ సందర్బంగా రవి ప్రతాప్ సింగ్ జనరల్ మేనేజర్ పేద విద్యార్థులకు సేవ చేయడం ఆదృష్టంగా భావిస్తున్నాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు ,అఖిలేష్ రెడ్డి , సహాయ సాంఘీక సంక్షేమ అధికారి బి. శంకర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రఘునాథ్, నవీన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్య భగవాన్ సిఎసార్ డిప్యూటీ మేనేజర్ యాదగిరి తదితర బృందం పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలి

### ఎస్ఐ బి.సౌజన్య

**ప్రజాపక్షం/బెజ్జంకి:** రోడ్డు భధ్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని ఎస్ఐ బి.సౌజన్య అన్నారు.సిద్దిపేట పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో Arrive Alive అనే నినాదంతో రోడ్డు భధ్రత నియమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సంధర్భంగా శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం హెల్మెంట్ లేని వాహనదారులకు నూతనహెల్మెంట్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో యువతి యువకులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



### అదనపు కలెక్టర్ పాండు

**పజాఫక్షం/సంగారెడ్డి :** రంజాన్ పండుగను జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా భక్తిశ్రద్దలతో జరుపుకోనేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో 2026 రంజాన్ పండుగ ఏర్పాట్లపై ముస్లిం ,మైనార్టీ పెద్దలు ,పోలీస్ రెవెన్యూ ,మున్సిపల్ ,పంచాయతీరాజ్ ,సివిల్ సప్లైయి ,వైద్య విద్యుత్ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ పాండు ఆర్ డి మాధురి లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను మంచి వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ,ఈద్‌ఉల్‌పేతర్ సందర్బంగా పట్టణాలు,మండలాల్లోని మసీదులు , ఈద్గాలకు వెళ్లే దెబ్బతిన్న ఆప్రోఛ్ రోడ్లను మరమ్మతు చేయాలని మసీదుల పరిసరాల్లో వీది దీపాలు హైమాస్ట్ లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ద్య చర్యలు చేపట్టి అదనపు చెత్త బిన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మసీదుల చుట్టుపక్కల చెత్త సమస్య వీది కుక్కల బెడద నివారించేందుకు చర్యలు తీసుకోవాలని రోడ్డు పక్కన వ్యాపారులకు ప్రత్యేక ప్లాస్టిక్ చెత్త సంచులు అందించాలని తెలిపారు. ట్రాపిక్ నియంత్రణ పోలీసు ,నఘా పెంచి శాంతి భద్రతలు కట్టుదిట్టుగా నిర్వహించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పండుగ మాసంలో నిరంతరం విద్యుత్ సరపరా కల్పించాలని లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట మొబైల్ ట్రాన్స్ పార్మర్లు ఏర్పాటు చేయాలని తెలిపార. దీన్‌దార్ ఖాన్ మసీదు సంగారెడ్డి జామియా , మసీదు, జహీరాబాద్ మసీదు ఇ అజీజీయా నారాయణఖేడ్ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖఅదికారులనుఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా గ్యాస్ సరఫరా చేయాలని అవసరాన్ని బట్టి అదనపు పాల సరపరా కల్పించాలని సివిల్ సప్లై శాఖను సూచించారు. వైద్య సిబ్బంది అంబులెన్స్ అందుబాటులో ఉంచి 24/7 అత్యవసర వైద్య సేవలు అందించాలని వైద్యాదికారులను ఆదేశించారు.

## పేదలకు అండగా సిఎం సహాయ నిధి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:**ఆపద కాలంలో పేదలకు అండగా ఉండటమే లక్ష్యంగా ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక స హాయం అందిస్తోందని బిజెపి పట్టణ అధ్యక్షు లు శివకుమార్ తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశా ల మేరకు కాగజ్ నగర్ పట్టణంలోని లోటస్ హౌస్‌లో మంగళవారం లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. పట్టణంలోని లక్ష్మీ నగర్ కాలనీకి చెందిన మొహిముద్దీన్, ద్వారక నగర్‌కు చెందిన శ్రావణి, విజయ్ బస్తీకి చెందిన వజ్రమ్మకు చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా శాసనసభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని నాయకులు వివరించారు.

# రోడ్డు భద్రతే ప్రమాదాల నివారణకు రక్ష

**ప్రజాపక్షం/ఖానాపూర్:**ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని,మైనర్ లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో తెలిపిన నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్.రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలనే ప్రధాన లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆరైవ్‌అలైవ్' కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహన దారులు సీట్ బెల్ట్ ధరించి ప్రమాదల భారీ నుండి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు.తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని,వారికి అవగాహన లేకపోవడంతో అతివేగంగా వెళ్లి వారికే కాకుండా ఇతర వాహన దారులకు ప్రమాదాలు అయి ప్రాణాలు కోల్పోతున్నార న్నారు.ఇలాంటి వాటిపైన ఖానాపూర్ సీఐ,ఎస్ఐ,ఆటో యూనియన్ డ్రైవర్లకు,పేద వెహికిల్ యూనియన్ డ్రైవర్లకు,అవగాహన సభ ఏర్పాటు చేయాలని అన్నారు.మద్యం సేవించి వాహనం నడపడం ఒక వ్యక్తినే కాదు,ఒక కుటుంబం మొత్తపు జీవితాన్ని నాశనం చేస్తుందని సూచించారు.ఈ ర్యాలీ సందర్భంగా ఖానాపూర్ ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే కు పలు విజ్ఞప్తులు చేశారు.సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆటో డ్రైవర్ల లైసెన్స్,ఇన్సూరెన్స్ పై ఉన్న ఫీజును తగ్గించేందుకు ఆర్టీ అధికారులతో మాట్లాడుతానన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఖానాపూర్ పట్టణ సీఐ అజయ్,ఎస్ఐ రాహుల్ గైక్వాడ్,ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజుల సత్యం మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్,కాంగ్రెస్ నాయకులు మధిరే సత్యనారాయణ,నేత శ్యామ్,అమానుల్లా ఖాన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.




## బాధిత కుటుంబాన్ని పరామర్శి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/కోహెడ:** మండల పరిధిలోని సముద్రాల గ్రామానికి చెందిన సిపిఐ మండల కార్యదర్శ వేల్పుల శ్రీనివాస్,ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా నాయకుడు వేల్పుల ప్రసన్న కుమార్‌ల తండ్రి వేల్పుల చంద్రయ్య ఇటీవల కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకోని ఇంటికి వచ్చిన సంధర్భంగా మంగళవారం సిద్ధిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ సిపిఐ కుటుంబాన్ని పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న వ్యాపారులు

**కేసముద్రం/ప్రజాపక్షం:** కేసముద్రం మండలంలో లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లి అశోక్, గౌరవాధ్యక్షుడు గుగులోతు వీరన్నల ఆధ్వర్యంలో మంగళవారం కేసముద్రం మున్సిపల్ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే కేంద్రంలో కేసముద్రంలో వ్యాపారులు, మిల్ యజమానుల తీరుకు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. కానీ మార్కెట్‌లో ఖరీదు చేస్తున్న వ్యాపారులు లారీల ద్వారా ధాన్యం ఎగుమతి చేసే సమయంలో ఒక్కో లారీ నుండి రూ.5వేల నుండి 6వేల వరకు వసూలు చేస్తూ లారీ యజమానుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యను పరిష్కరించి జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లారీఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ధరావత్ భీమా, కోశాధికారి వెంకటేశ్వర్ రావు, యాకన్న, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** జీ మంత్రి బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావుపై కక్ష సాధింపు చర్యలు మానుకుని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తు బిఅర్ ఎస్ పార్టీ నేతలు మంగళవారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ అంబేక్కర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను సభలో ఎప్పటికప్పు ఎండగడుతన్న మంత్రి హరీష్‌రావును అక్రమ కేసులు పెట్టి నోరు మూయాలని చూస్తే ప్రజలు తరిమికోడుతారని హెచ్చరించారు . మున్సిపల్ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు ఓటమి భయంతో అక్రమంగా కేసులు పెడుతూ అరెస్టులు చేయడం సరైంది కాదని అన్నారు. ఎన్నికల హామీలను నెవేర్చలేక రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నిస్తారేమోనని భయంతో కాంగ్రెస్ నేతలు చెస్తున్న పన్నాగం అన్నారు. ఇచ్చిన హామీలను తీర్చకుండ ప్రజాపాలన పై దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ మున్సిపల్ చైర్మెన్ చెంద్రయ్య, మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్‌పాషా, బీలునాయక్ , వాల నవీన్‌రావు,శ్రీనివాస్‌గౌడు, వెంకన్న, వికాస్‌యాదవ్, చిరంజావి, బొల్లి శ్రీనివాస్, రవిందర్‌గౌడు, ధబ్బూమస్, సతీస్‌సునిత తదితరులు పాల్గోన్నారు.



## బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక పట్ల హుస్నాబాద్‌లో సంబరాలు

**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** భారతీయ జనత పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్‌నబీన్ ఎన్నిక పట్ల మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో బిజెపి నాయకులు స్వీట్లు పంచి సంబరాలు చేసున్నారు. ఈ సందర్బంగా పట్టణ అధ్యక్షుడు బత్తు శంకర్‌మాట్లాడుతూ దేశ చరిత్రలేనే అత్యంత చిన్న వయస్సుకుడైన 45 ఏళ్ల నితీన్‌నభీన్ ఎన్నిక భారత దేశ ప్రజానికం హర్షతీరేఖలుల వ్యక్తం చేస్తున్నయని జాతీయ అధ్యక్షడి ఎన్నికకు ప్రధాని నరేంద్ర మోడి ఎప్పతనం వెత కట్టలేనిదని అన్నారు. దేశంలో రాబోవు ఎన్నికల్లో యువతరంతో దేశ మంతట భిజెపి అధికారం లోకి వచ్చి రామరాజ్యాం స్థాపించబోతుందని చెప్పడానికే ఇది మొదటి సంకేతంమని అన్నారు. నరేంద్ర మోడి నాయకత్వంలో నేడు ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం ఒక శక్తి వంత దేశంగా మారిందిని అన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాని ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరి గెలుపుకు కృషి చేస్తు మున్సిపల్ పై బిజెసి జెండను ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాగర్జునా, వెంకటేశ్, రాజేందర్, సాయిరాం, రాజు, బొనగిరి రవి, అరుణ్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, లకావత్ శారద, తిరుపతి, లక్ష్మ న్, శేఖర్, సాంబరాజు, రాజేశ్‌లు పాల్గోన్నారు.

# చరిత్రలో నిలిచే ఘట్టం సమ్మక్క సారలమ్మ మేడారం జాతర

### మంత్రి సీతక్క కృషితో వందల కోట్ల నిధులతో అభివృద్ధి

**ప్రజాపక్షం,/ గూడూరు :** చరిత్రలో నిలిచిపోయే ఘట్టం సమ్మక్క సారలమ్మ మేడారం జాతర అని మంత్రి సీతక్క కృషితో వందల కోట్ల నిధులు విడుదల చేసి ప్రజల వద్దకు పాలన అనే విధంగా కేబినేట్ సమావేశం నిర్వహించడం జరిగిందని గూడూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జా సారయ్య అన్నారు. కొంతమంది నాయకులు ఒక పత్రిక ప్రకటన ద్వారా మేడారంలో జరిగిన కేబినేట్ సమావేశం మంత్రుల వీఐపీ పాసుల కోసమే జరిగిందని మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ములుగు నియోజకవర్గంలో మేడారం జాతరతో పాటు గోదావరి జలాలు వందల కోట్లతో వ్యవసాయ రంగంకు సాగునీటికి ప్రత్యేక నిధులు కల్పించిన రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గంలో రోడ్లు, భవనాలు గ్రామ గ్రామాన అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహిళలకు ప్రత్యేక రుణాలు, పలు అభివృద్ధి రంగాలకు రాష్ట్ర కేబినేట్ మంత్రులు నియోజకవర్గానికి మంత్రి సీతక్క అడిగిన వెంటనే వరాల జల్లులు కురిపించారని, దీనిని జీర్ణించుకోలేక సీఎం రేవంత్‌రెడ్డిపై, ఆదివాసీ ముద్దబిడ్డ మంత్రి సీతక్కపై చౌకబారు మాటలు మాట్లాడటం సరికాదన్నారు. కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి అండగా నిలుస్తున్నారని అన్నారు. మంత్రి సీతక్క అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రూప్‌సింగ్, ఉపాధ్యక్షులు చొప్పరి కుమారస్వామి, సర్పంచ్‌లు మల్లెల భాగ్యమ్మ, ఈక సుమలత శ్రీనివాస్, గట్టి రాములు, పెనుక సిరివెన్నెల కిశోర్, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, మండల నాయకులు బూర్క నరేందర్, యాదగిరి, కిరణ్ కుమార్, సోలం వెంకన్న, వెంకన్న పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేత హరికృష్ణను పరామర్శి

### మంత్రి వివేక్‌వెంకటస్వామి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ అస్వస్థతకు గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి మంగళవారం పరామర్శించారు. హరికృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ హరికృష్ణకు అవసరమకు అన్ని వైద్య సదపాయాలు అందించాలని వైద్య బృందానికి సూచించారు. హరికృష్ణకు మెరుగైన వైద్య చికిత్సను అందించాలని సూచించారు. హరికృష్ణ త్వరగా పూర్తి స్థాయిలో కోలుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. మంత్రి వివేక్‌తో పాటు వచ్చిన పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు హరికృష్ణకు దైర్యం చెప్పి అండగా నిలిచారు. హరికృష్ణ త్వరగా కోలుకోని మళ్లీ ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, రాజబహాదూర్ రెడ్డి, మీసం మహేందర్, మిట్టపల్లి శ్రీనివాస్. పూజల గోపి కృష్ణ,రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో బిఆర్‌ఎస్ జండా ఎగరడం ఖాయం

### బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవితి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీలో బిఆర్‌ఎస్ జండా ఎగరడం ఖాయమని, కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం కవిత క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. కాంగ్రెస్ పార్టి హరీశ్ రావు గారిని ఇబ్బందీ పెట్టాలని ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెట్టాలని చూస్తోందని, రేవంత్ రెడ్డి ఖమ్మం సభలో బిఆర్‌ఎస్ పార్టీపై తనకు ఉన్న అక్కసు వెళ్ళకక్కాడని ఆమె ఆరోపించారు. రేవంత్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి మహబూబాబాద్ డిఎస్‌పికి పిర్యాదు చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ కేసులకు భయపడదని, హరీష్‌రావుకు బిఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఆమె అన్నారు.

## సమన్వయ సమావేశం నిర్వహించిన సర్పంచ్ జోగేశ్వర్

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలోని చిన్నమడర్ గ్రామంలో సర్పంచ్ మైదం జోగేశ్వర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి గ్రామస్థాయి అధికారులతో సర్పంచ్ మైదం జోగేశ్వర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి, ప్రజలకు అందాల్సిన సేవలు సక్రమంగా అమలయ్యేలా అధికారులతో చర్చించారు.

## తహసీల్దార్ కుటుంబానికి పరామర్శి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రఘునాథపల్లి తహశిల్దార్ లంక ఫణికిషోర్ తల్లి నాగ రాజకుమారి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు వారి స్వగృహానికి వెళ్లి మె పార్టీవదేహానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించి తహశిల్దార్‌ను పరామర్శించారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తాం

## ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

**ప్రజాపక్షం,/ తొర్రూరు :** అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.6.75కోట్లతో నిర్మించిన ధోబి ఘాట్, శ్మశాన వాటిక, మైత్రి భవన్ కమ్యూనిటీ, పద్మశాలి, స్వామి వివేకానంద, గౌడ సంఘం, పద్మశాలి, నాయీబ్రాహ్మణ, విశ్రాంత ఉద్యోగుల, ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పలు సామాజిక వర్గాల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణంతో ఆయా వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితమైందని, ఎక్కడా పనులు పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలోనే అనేక పనులు చేపట్టడం జరిగిందన్నారు. తొర్రూరు పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణ వాసులకు ఆహ్లాదం పంచేందుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.కోట్లతో పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికి ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పర్యటించి సమస్యలను గుర్తిస్తామన్నారు. అవసరమైన పనులను గుర్తించేందుకు ఇప్పటికే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి



హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని గుర్తు చేశారు. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి మరో రూ.15కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. త్వరలోనే ఆ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

## కెటిపిపిలో పటేల్ ఎంప్లాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో మంగళవారం కెటిపిపి పటేల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫ్యామిలీ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కావటి రజిత రవీందర్ పటేల్ మాజీ సర్పంచ్ కొత్త వెంకటేశ్వర్లు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి సంఘ కార్యక్రమాలు గ్రామ సామాజిక అభివృద్ధికి దోహద పడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కెటిపిపి పటేల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేటీపీపీ పటేల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెంచాలా రాజు పటేల్, గౌరవ అధ్యక్షులు శేషగిరి రావు పటేల్, కమిటీ సభ్యులు జగదీష్ పటేల్, కొత్త రాజేంద్ర పటేల్, సూర నరేందర్ పటేల్, సిలువేరు నరేందర్ పటేల్, ఉసికె రవీందర్ పటేల్, అల్లం రాజేందర్ పటేల్, కొండ శ్రీనివాస్ పటేల్, కట్ట శివరామకృష్ణ పటేల్ పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడలు ప్రారంభించిన

### ఎంపిడిఒ భాస్కర్

**ప్రజాపక్షం/గణపురం:** సీఎం కప్ క్రీడలను మంగళవారం గణపురం ఎంపీడీవో ఎల్ భాస్కర్ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామ పంచాయతీ స్థాయి (జీపీ లెవల్) సీఎం కప్ క్రీడా పోటీలు జరగగా వివిధ గ్రామాల నుండి క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని, ఓటమిని సవాలుగా తీసుకొని గెలుపు వైపు సాగాలని సూచించారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ వంటి పోటీల్లో తొమ్మిది గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, ఉప సర్పంచ్ ఒరుగంటి కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు కొసరి సరిత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముస్సిపల్ కమిషనర్‌గా ఇసంపెల్లి జోన

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ గా ఇసంపెల్లి జోన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను నూతన కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో గ్రూప్ వన్ ఆఫీసర్ గా కమిషనర్ గా పని చేసిన ఉదయ్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం వెల్లగా నూతన కమిషనర్ గా ఈసంపల్లి జోన కు కమిషనర్ బాధ్యతలు అప్పగించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 5 ఇంక్లైన్ ఆర్చ్ నుండి భాస్కర్ గడ్డ వైపు బిటి రోడ్డు వైడెనింగ్ రూ.2 కోట్లతో నిర్మాణ పనులు, భాస్కర్ గడ్డ పోషమ్మ దేవాలయం నుండి వేషాలపల్లి డబుల్ బెడ్రూం వరకు రూ 1కోటి .50 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో రూ.2కోట్ల తో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అన్నారు. 5 ఇంక్లైన్ జంక్షన్ నుండి భాస్కర్ గడ్డ వరకు బీటీ రోడ్డు వైడనింగ్ వల్ల ఈ ప్రాంత ప్రజలకు వసతి సౌకర్యాలు కలుగుతాయని అన్నారు. అట్లాగే పోచమ్మ దేవాలయం నుండి వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్,పెద్ద కుంటపల్లి వరకు బీటి రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. వేషాలపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీవా సులు కోరడంతో ప్రహరి గోడ నిర్మాణానికి రెండు కోట్ల నిధులు కేటాయించి సీసీ



రోడ్లు,సైడ్ డ్రైన్స్ అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. భూపాలపల్లి 30 వార్డులలో ప్రజలకు కావలసిన అనేక మౌలిక వసతులు, సిసి రోడ్లు, సైడ్ డ్రైనేజీలు ఏర్పాటు చేసి భూపాలపల్లి మున్సిపాలిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ సహకారంతో భూపాలపల్లి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, ఆకుల మహేందర్, డబుల్ బెడ్ రూమ్ కమిటీ అధ్యక్షుడు మేరా సురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మంద క్రిష్ణను కలిసిన రౌతు రమేష్ కుమార్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హనుమకొండకు వచ్చిన సందర్భంగా మంగళవారం దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే విద్యుత్ సంస్థలో హెల్పర్ స్థాయి నుంచి ఇన్స్పెక్టర్ వరకు సుదీర్ఘకాలం సేవలందించినందుకు రమేష్ కుమార్‌ను అభినందించారు.మందకృష్ణ మాదిగను శాలువతో సత్కరించారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని సీతారాంపురం గ్రామంలో మంగళవారం సర్పంచ్ తోట రాకేష్ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘంలో ఉన్న వాళ్లే కాకుండా రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి మహిళ ఇందిమ్మ చీరలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మంద అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ గంధం ఓదాకర్, మహిళా సంఘాలు, సభ్యులు పాల్గొన్నారు.

## రమణన్న బస్తీబాటలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు జవహర్ నగర్ కాలనీలో బీఆర్ ఎస్ పట్టణ అధ్య క్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రమణన్న బస్తీబాట కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జెడ్పీ మాజీ చైర్పర్సన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లాఅధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత పదేళ్ళ కేసీఆర్ పాలనలో భూపాలపల్లి ముఖ చిత్రాన్ని మార్చినం అని అన్నారు. భూపాలపల్లి చిన్న గ్రామాన్ని నగర పంచాయతీగా, మున్సిపాలిటీ నేడు జిల్లాగా తీర్చిదిద్దడంలో మా కృషి ఎంతో ఉంది అని మీకు గుర్తు చేశారు.మిషన్ భగీరథ ద్వార ప్రతి ఇంటికి మంచినీరు ఇచ్చి న ఘనత కెసిఆర్ దని అన్నారు. భూపాలపల్లి పట్టణాని అభి వృద్ధి చేయాలనే ఉద్దే



శ్యంతో కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థికి మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుర్ర రమేష్ గౌడ్, మేకల సంపత్ కుమార్, సెగ్గం సిద్ధు, నూనె రాజు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరం

### రోయ్యూరు పశు వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం :** మండలంలో దేవాదుల గ్రామంలో మంగళవారం ఉచిత పశుగర్భకోశ వ్యాధి శిబిరం రోయ్యూరు పశువైద్యఅధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ అగ్గు రోజావెంకటేష్. ఉపసర్పంచ్ పాలకుర్తి మౌని శ్రీధర్, ఈ కార్యక్రమానికి హాజరైమాట్లాడుతూ గ్రామంలో పశువులకు ఇలాంటి వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ ఎ.ఐలుమల్లు గోపాలమిత్ర వాసంపల్లి నరేందర్, వలస శ్రీను గ్రామస్థుల తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులు పట్ల ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించాలి

### వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యను సావధానంగా విని సమస్యను పరిష్కరించడంలో పోలీసులు తమదైన పాత్రను పోషిస్తూ పోలీసుల పట్ల ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించుకోవాలని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీసీపీ విచ్చేయగా ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్ ఆయనకు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, రికార్డ్ రూమ్, క్రైమ్ పాపర్టీ, నేరాలు పట్టుబడిన వాహనాలు, రికార్డ్స్ లను ఆయన తనిఖీ చేశారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,ఎస్పీ సంకీర్త్ లు సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్లో రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా లో ముఖ్యంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగు ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించామని రోడ్లపై అతివే గంగా వెళ్లే వాళ్లకు స్పీడ్ గన్ అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ప్రమాదాల బారిన పడిన వారికి సకాలంలో సహాయం చేసి ప్రాణదానం చేయాలని జిల్లా ప్రజలను కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మన దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, అందులో దాదాపు 50 వేల మంది సకాలంలో వైద్య సహాయం అందకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

## యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సీఎం కప్ పోటీలు గ్రామీణ, పట్టణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని, ఆత్మవి శ్వాసం, శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని జయశంకర్ సార్ విగ్రహం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ టార్చ్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం టార్చ్ ను వెలిగించి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీ లో పాల్గొన్నారు.ఒలింపిక్స్ లో దేశం నుంచి ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు.